ప్రజాశక్తి

గురువారం 25 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

వైసిపి అవినీతి కోటను బద్దలు కొడదాం

సింగవరం సభకు హాజరైన జనం

- అధికారంలోకి వస్తే వలసలు అరికడతాం
- ఇండస్ట్రియల్ హబ్‌గా నెల్లిమర్ల
- విజయనగరం, డెంకాడ సభల్లో చంద్రబాబు, పవన్

ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్

ప్రజాశక్తి- విజయనగరం కోట, భోగాపురం

రాష్ట్రంలో వైసిపి అవినీతి కోటను బద్దలు కొడతామని టిడిపి, జనసేన అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ అన్నారు. పన్నులు పెంచి ప్రజలపై అనేక విధాలా భారాలు వేసిన జగన్‌ను ఇంటికి పంపాలని పిలుపు నిచ్చారు. బుధవారం డెంకాడ మండలం సింగవరం, విజయనగరం కలెక్టరేట్ జంక్షన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు మాట్లాడారు. ఎన్నో వనరులున్న నెల్లిమర్ల నియోజక వర్గాన్ని ఇండస్ట్రీయల్ హబ్‌గా తయారు చేసి వేలాది మంది స్థానికులకు ఉద్యోగాలిచ్చే బాధ్యత తమదని అన్నారు. సభలకు వచ్చిన జనాలను చూస్తే వైసిపికి డిపాజిట్లు కూడా రావని తనకు అర్థమైపోతుందన్నారు. వైసిపి పరిస్థితి ఎలా ఉందంటే శ్రీకాకుళంలో సిఎం సభకు ప్రతి ఒక్కరికీ క్వార్టర్ బాటిల్, బిర్యాని, రూ.500 ఇచ్చినా ఎవరూ రావడం లేదని ఎద్దేవా చేశారు. సైకో జగన్.. ఉత్తరాంధ్రకు ఒక్క ప్రాజెక్టు అయినా తెచ్చావా? అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రపై ప్రేమతో భోగాపురంలో ఎయిర్ పోర్టు నిర్మించాలని భావిస్తే దాన్ని కూడా పూర్తి చేయలేక పోయాడని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే 2025 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రకు ఏమీ చేయని ఈ అహంకారి, విధ్వంసకారుడు, దోపిడీదారుడని విమర్శించారు. విచిత్రంగా రోజు రోజుకూ జగన్‌కు తగిలిన దెబ్బ పెరిగిపోతుందని (మిగతా.. 3లో)

డప్పుకొట్టి శిక్షణను ప్రారంభిస్తున్న సిపిఎం ఎంపి అభ్యర్థి అప్పలనర్స

రాష్ట్రానికి కేంద్రం ద్రోహం

- బిజెపి, దాని మిత్రులను ఓడించాలి
- సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స
- పిఎన్‌ఎం కళాబృందాల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, మిత్రులను రానున్న ఎన్నికల్లో ఓడించి, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని అరకు పార్లమెంటు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రజానాట్యమండలి పాటలు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణను ఆయన డప్పు కొట్టి ప్రారంభించిన అప్పలనరస ప్రారంభించారు. తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్రానికి దేశానికి ద్రోహం చేస్తున్న బిజెపిని ఓడించాలంటే ప్రజా పోరాటాలతో పాటు ప్రజా కళాలు కళారూపాలు అంతే ప్రాధాన్యతని సంతరించుకున్నాయని అన్నారు. ప్రజా సమస్యలు పాట, ఆట ద్వారా ప్రజలకు వివరించి ఈ ఎన్నికల్లో సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి, కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాచిపెంట అప్పల నరస మందంగి రమణను గెలిపించాలని కోరారు. అనంతరం అప్పలనరస మాట్లాడుతూ రాజకీయ పోరాట కర్తవ్యాన్ని (మిగతా.. 3లో)

నామినేషన్ల కోలాహలం

సాలూరులో డిప్యూటీ సిఎం రాజన్నదొర నామినేషన్‌కు హాజరైన వైసిపి శ్రేణులు

- ఉమ్మడి జిల్లాలో 61 నామినేషన్లు దాఖలు
- విజయనగరంలో ఎమ్‌పికి 4, అసెంబ్లీకి 31
- మన్యంలో ఎమ్‌పికి 10, శాసనసభకు 16

ప్రజాశక్తి-విజయనగరం కోట, పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆరో రోజు బుధవారం 76 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో విజయనగరం పార్లమెంట్ స్థానానికి 5 నామినేషన్లు, 7 అసెంబ్లీ స్థానాలకు 31 నామినేషన్లు పడ్డాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో అరకు పార్లమెంట్ స్థానానికి 10 నామినేషన్లు, 4 అసెంబ్లీ స్థానాలకు 16 నామినేషన్లు దాఖలయ్యాయి.

విజయనగరం పార్లమెంటు స్థానానికి 4 నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. టిడిపి అభ్యర్థిగా కలిశెట్టి రామలక్ష్మి, కాంగ్రెస్ తరపున బొబ్బిలి శ్రీను, నవ భారత నిర్మాణ సేవా పార్టీ అభ్యర్థిగా వంగపండు మహేశ్వరరావు, వైసిపి అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ నామినేషన్ పత్రాలను (మిగతా.. 3లో)



నామినేషన్ వేస్తున్న టిడిపి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కళావెంకటరావు ; కాంగ్రెస్ పార్టీ విజయనగరం ఎంపి అభ్యర్థి బొబ్బిలి శ్రీను

తారకరామ నిర్వాసితులపై నిర్లక్ష్యం

జిల్లాలోని తారకరామ తీర్థసాగర్ నిర్వాసితులపై నాడు చంద్రబాబు, నేడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించాయి. ఐదేళ్లుగా అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేసుకొచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనే అభివృద్ధి చెందాయంటూ కితాబిచ్చేస్తోంది. ఇవన్నీ వట్టిమాటలు కావడంతో నిర్వాసితులు... అధికార పార్టీ నాయకులపై అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. రెండు నెలల క్రితం తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్‌పిలను చుట్టుముట్టి ప్రశ్నించడమే ఇందుకు తార్కాణంగా. పదేళ్లు అధికారంలో ఉండి పట్టించుకోని చంద్రబాబు తాజాగా ఎన్నికల ప్రచారంలో తారకరామ ప్రాజెక్టు నిర్మాణ పనులు, నిర్వాసిత సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఎన్నికల వేళ ప్రాజెక్టు పూర్తిచేయకపోవడంపై రాజకీయ చర్చనడుస్తోంది.

- పరిహారం, పునరావాసానికి రూ.193.21కోట్లు అవసరం
- అదిగో.. ఇదిగో అంటూనే వైసిపి ఐదేళ్లు కాలక్షేపం
- అంతకు ముందు బాబు వైఖరీ అంతే
- ఎన్నికల వేళ నిలదీతలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో నాలుగు మండలాల పరిధిలో 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా అప్పట్లోనే నెల్లిమర్ల మండలం కోరాడపేట, పడాలపేట, ఆత్మారాముని అగ్రహారం గ్రామాలను పూర్తిగా (మిగతా.. 3లో)

సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వండి : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. పట్టణంలోని మూడో వార్డులో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా శంబంగి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పాలన సాగిస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజా సంక్షేమ పాలనకు మద్దతు ఇచ్చి ఓటు వేసి గెలిపించాలని కోరారు. శంబంగి, ఆయన కుమారుడు శ్రీకాంత్ రెండు బృందాలుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బిజెపికి షాక్.. వైసిపిలో చేరిన మాజీమంత్రి పెద్దింటి

నియోజకవర్గంలో బిజెపికి గట్టి షాక్ తగిలింది. మాజీమంత్రి పెద్దింటి జగన్మోహనరావు బిజెపిని వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో కాంగ్రెసు నుంచి మూడు సార్లు పోటీ చేసిన పెద్దింటి రెండు సార్లు విజయం సాధించారు. వైసిపి ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరినా, ఎక్కువ కాలం ఉండలేదు. వైసిపిని వీడి బిజెపిలో చేరారు. పెద్దింటి, ఆయన కుమారుడు రామస్వామినాయుడు శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ఉన్న సిఎం జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ముఖ్యమంత్రి జగన్ ఇద్దరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.

వైసిపిలో చేరికలు

మున్సిపాలిటీలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన 15 మంది యువకులు బుధవారం వైసిపి సీనియర్ నాయకులు సావు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టిడిపిని వీడి

ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో చేరిన గొల్లిపల్లి గ్రామస్తులు

వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సమక్షంలో వైసిపిలో చేరారు.

నేడు కడుబండి ఎన్నికల ప్రచారం

వేపాడ : మండలంలో వైసిపి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటల నుండి సోంపురం, జగ్గయ్యపేట, అరిగిపాలెం, ఆకులసీతంపేట, ఆతవ గ్రామాలలో ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రచారం చేస్తున్న బేబినాయన

ప్రజాపాలన మాతోనే సాధ్యం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా పాలన టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన అందించడంలో సిఎం జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే ప్రజా పాలన అందిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలో రొంపల్లి గ్రామంలో టిడిపి అభ్యర్థులకు మద్దతుగా ఎంపిటిసి సభ్యులు భవిరెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న లలితకుమారి

కోలాహలంగా కోళ్ల నామినేషన్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

టిడిపి శృంగవరపుకోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల కోలాహలం నడుమ బుధవారం నామినేషన్ వేశారు. లక్కవరపుకోటలో తన ఇంటి నుండి కార్లు, బైక్‌లతో పెద్ద ఎత్తున భారీ ర్యాలీతో మొదలై ఎస్.కోట దుర్గాదేవి గుడికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు ఇందుకూరి సుధారాణి, రాయవరపు చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, నాయకులు చొక్కాకుల జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో 7 నామినేషన్లు దాఖలు

శృంగవరపుకోట : ఎస్.కోట నియోజకవర్గంలో బుధవారం ఏడు నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ తెలిపారు. శృంగవరపుకోట పట్టణానికి చెందిన చిప్పాడ శేషగిరిరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా, విశాఖ జిల్లా ఆనందపురం మండలం గుడిలోవ గ్రామానికి చెందిన వెన్నకోట జగన్నాథరావు సమాజ్‌వాది పార్టీ తరపున నామినేషన్ సమర్పించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి మూడు సెట్లు, గొంప సత్యవతి 2 సెట్లు నామినేషన్ పత్రాలను ఆర్ఒ మురళీకృష్ణకు అందించారు.

మద్యపాన నిషేధం అమలేది?

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి అధికారంలోకి వస్తే దశల వారీగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి ఎక్కడ అమలు చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మద్యపాన నిషేధం అమలు చేయకుండా పట్టణ, గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయని వైసిపిని, బిజెపితో జతకట్టి విభజన హామీలను తుంగలో తొక్కిన టిడిపి, జనసేన, బిజెపి కూటమిని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

29 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 7 వరకు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని జయప్రదం చేయాలని గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి కోరారు. వేసవి సెలవులలో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. విజ్ఞాన శిబిరానికి విద్యార్థులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యుదయ, పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులను కలిసి విజ్ఞాన శిబిరానికి పిల్లలను పంపించాలని కోరారు.

ఎజెపాలెంలో అన్నదానం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అంకాజోస్యులపాలెం గ్రామంలో మరిడిమాంబ ఆలయ ప్రతిష్ట సందర్భంగా బుధవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత పూజలు నిర్వహించారు. మహిళలతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

వింత దూడ జననం

ప్రజాశక్తి- గరివిడి

జన్మించిన వింతదూడ

స్థానిక పశువైద్య కళాశాలలోని వైద్యశాలకు గుర్ల మండలం గొలగాం గ్రామానికి చెందిన రైతు కలిశెట్టి మురళి తన ఆవు ఈనలేకపోతుందని బుధవారం తీసుకొచ్చాడు. వైద్య కళాశాలలోని వైద్య బృందం ఆవును పరీక్షించి ఆపరేషన్ ద్వారా దూడను గర్భం నుంచి బయటికి తీశారు. అయితే దూడ రెండు తలలు, రెండు తోకలు, మూడు నాలుకలు, ఒక జత ముందు కాళ్ళు, రెండు జతల వెనుక కాళ్లు, పేగులు, కాలేయం పొట్టనుంచి బయటకు వచ్చి జన్యుపరమైన లోపంతో పుట్టింది. ఇలాంటి దూడను సాంకేతిక భాషలో కాజొఇన్డ్ మోనెస్టర్, షిస్తోసమల్ రిఫ్లెక్ అంటారని శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులు వివరించారు. శస్త్ర చికిత్స చేసిన డాక్టర్ ఎమ్ఎస్ఎస్‌వి ఫణీంద్ర, డాక్టర్ తేజోరాణి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ప్రభాకర్ రావును కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ మక్కెన శ్రీను అభినందించారు.

'జెబిబి పార్టీతో ఎస్‌సి, ఎస్‌టిలకు మేలు'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జై భీమ్‌రావు భారత్ పార్టీతో ఎస్‌సి, ఎస్‌టిలకు మేలు జరుగుతోందని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి టొంపల నరసయ్య అన్నారు. బుధవారం జై భీమ్‌రావు భారత్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రామతీర్థం కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారాన్ని ప్రారంభించారు. నరసయ్య మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ ఆశయ సాధనకు హై కోర్టు మాజీ జడ్జి జాడ శ్రావణ్ కుమార్ జై భీమ్‌రావు భారత్ పార్టీ స్థాపించారన్నారు. దీనిలో భాగంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీచేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో కనిగిరి శ్రీనివాస రావు తదితరుల పాల్గొన్నారు.

బొబ్బిలిలో బస్సుల కోసం కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్సుల కోసం రెండోరోజూ తిప్పలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆర్‌టిసి బస్సుల కోసం ప్రయాణికులకు రెండోరోజు తిప్పలు తప్పలేదు. శ్రీకాకుళం జిల్లాలో సిఎం జగన్మోహన్ రెడ్డి పర్యటనకు ఆర్‌టిసి బస్సులను రెండోరోజూ మళ్లించారు. దీంతో బస్సుల కోసం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు లేకపోవడంతో ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆర్‌టిసి అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేగిడి : ఆర్‌టిసి బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సిఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలు, బస్సు యాత్రకు జనాన్ని తరలించడానికి పాలకొండ, రాజాం, విజయనగరం, శ్రీకాకుళం డిపోల నుంచి పెద్ద ఎత్తున బస్సులను తరలించారు. దీంతో ప్రయాణికులకు సకాలంలో బస్సులు అందక అవస్థలు పడ్డారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు కిలోమీటర్ల మేర నడవవలసిన పరిస్థితి నెలకొంది.. ఒక పక్క ఎండ మరో పక్క బస్సులు లేకపోవడంతో నిరీక్షించేందుకు ప్రయాణికులు విసుగు చెందారు. సిఎం సభలు పెడితే ఇలా ప్రతి రోజూ బస్సులను తరలిస్తారా అని మండిపడ్డారు.

అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం కుదేలు

ప్రజాశక్తి -వంగర

ప్రచార సభలో మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహనరావు

వైసిపి అప్రజాస్వామిక విధానా లతో రాష్ట్రం కుదేలైందని మాజీ మంత్రి, రాజాం నియోజకర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ అన్నారు. మండలంలోని వివిఆర్ పేట, రాజులగుమ్మడ, చిన్న రాజులగుమ్మడ, కొప్పరవలస గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ బైక్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ సిక్స్, బీసీ డిక్లరేషన్‌లపై ప్రజలకు వివరించారు. పెద్ద రాజుల గుమ్మడ గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, కొప్పర వలస గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టిడిపిలో చేరాయి. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, ఉదయాన మురళీకృష్ణ, ఎలకల దుర్గబాబు, బెజ్జిపురపు రవి, ముంజు గోవింద, సాదెం అప్పలనాయుడు, రౌతు తవిటినాయుడు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నామినేషన్ల కోలాహలం

రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు 31 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయనగరం పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి బొబ్బిలి శ్రీను, టిడిపి నుంచి కలిశెట్టి రామలక్ష్మి, నవ భారత్ నిర్మాణ్ సేవా పార్టీ నుంచి వంగపండు మహేశ్వరరావు, వైసిపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ నామినేషన్లు వేశారు. విజయనగరం అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థులుగా పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, సునీలా గజపతిరాజు, స్వతంత్రులుగా పాండ్రంకి వెంకటరమణ, పడాల ఆదినారాయణ, షేక్ రామ్‌తుల్లా తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి కార్తీక్‌కు అందజేశారు.

గజపతినగరం : నియోజకవర్గంలో ఆరుగురు నామినేషన్లు వేశారు. టిడిపి నుంచి కొండపల్లి శ్రీనివాస్, కొండపల్లి లక్ష్మీ సింధు, కాంగ్రెస్ నుంచి డోల శ్రీనివాస్, జై మహాభారత్ పార్టీ నుంచి లెంక సూర్యారావు, సమాజవాది పార్టీ నుంచి కిలపర్తి కుమార్‌రాజు, స్వతంత్ర అభ్యర్థిగా తలపుల శంకర్రావు నామినేషన్లు వేశారు.

చీపురుపల్లి : నియోజకవర్గంలో ముగ్గురు నామినేషన్లు వేశారు. టిడిపి నుంచి కిమిడి కళా వెంకటరావు, కిమిడి వెంకట సూర్య రామ మల్లిక్, రిపార్టీ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా అదపాక సూరిబాబు నామినేషన్ వేశారు.

శృంగవరపుకోట : నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టిడిపి నుంచి కోళ్ల లలితకుమారి, గొంప సత్యవతి, సమాజ్‌వాదీ పార్టీ నుంచి విన్నకోట జగన్నాధరావు, స్వతంత్ర అభ్యర్థిగా చిప్పాడ శేషగిరిరావు నామినేషన్ వేశారు.

నెల్లిమర్ల : నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నుంచి టొంపల నర్సయ్య, అఖిల భారతీయ జన సంఘ్ నుంచి నడిపేన శ్రీను, స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సత్య ప్రసాద్‌బాబు నామినేషన్లు వేశారు.

రాజాం : నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైసిపి అభ్యర్థి తలే రాజేష్, డాక్టర్ గాయం మాధవి లత, టిడిపి నుంచి కోండ్రు శ్రీ లక్ష్మి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా కప్పిలి చైతన్యకుమార్ నామినేషన్లు వేశారు.

బొబ్బిలి : నియోజకవర్గంలో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మరిపి విద్యాసాగర్, టిడిపి నుంచి శిల్పారావు, నవ భారత్ నిర్మాణ్ సేవా పార్టీ నుంచి తుమరాడ రమణమ్మ, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా రౌతు జయ రామ కృష్ణ నాయుడు, మర్రాపు భానుమూర్తి నామినేషన్లు వేశారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో..

అరకు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా గుమ్మ తనూజ రాణి, చెట్టివినయ్, సిపిఎం అభ్యర్థిగా కిల్లో సురేంద్ర, స్వతంత్ర అభ్యర్థులుగా జోరంగి వెంకటరావు, నిమ్మక జయరాజు, బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత తరపున రెండు సెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు అశోక్‌కుమార్, సమరెడ్డి బాలకృష్ణ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇండియన్ ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా ఊయక చెంచు ఒక సెట్ నామినేషన్ వేశారు.

సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పి.రాజన్నదొర రెండోసారి నామినేషన్ వేశారు. ఇదే పార్టీ అభ్యర్థిగా పీడిక సుదర్శనరావు, కాంగ్రెస్ అభ్యర్థి మువ్వల పుష్పారావు, టిడిపి అభ్యర్థి సంధ్యారాణి నామినేషన్లు వేశారు.

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా బిడ్డిక శంకరరావు, మండంగి రమణ రెండవ సెట్ నామినేషన్ వేశారు. టిడిపి అభ్యర్థిగా అడ్డాకుల నరేష్, వైసిపి తరపున ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు

పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ, కాంగ్రెస్ అభ్యర్థిగా సవర చంటిబాబు, స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక పాండురంగ నామినేషన్లు వేశారు.

పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా అలజంగి జోగారావు, అలజంగి రవికుమార్, టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పొట్నూరు కిరణ్ కుమార్, స్వతంత్ర అభ్యర్థిగా అక్కివరపు మోహన్ రావు నామినేషన్లు వేశారు.

తారకరామ నిర్వాసితులపై నిర్లక్ష్యం

ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. సారిపల్లి వాసులు పూర్తిగా భూములు కోల్పోతారని ఆ రిపోర్టుల్లో పేర్కొన్నారు. భూములన్నీ పోయాక ఊళ్లో ఉండి తామేం చేస్తామన్నది సారిపల్లి వాసుల వాదన. ఈ నేపథ్యంలో తమను ప్రత్యేకంగా ఆదుకోవాలంటూ ఆ గ్రామస్తులు కోరారు. ఇందుకు నాటి టిడిపి, అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలతోపాటు వైసిపి కూడా అంగీకరించినప్పటికీ ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. అటు పూర్తి ముంపు గ్రామాల గురించి కూడా పట్టించుకోలేదు. ప్రభుత్వం గుర్తించిన మూడు ముంపు గ్రామాల నిర్మాణ విలువ (స్ట్రక్చరల్ వేల్యూ) రూ.34.46 కోట్లుగా అప్పట్లో లెక్కించారు. ప్రస్తుతం దీని విలువ సుమారు నాలుగు రెట్లు పెరిగి ఉంటుంది. కోరాడపేటలోని 171 కుటుంబాలవారికి పునరావాస కాలనీ నిర్మించేందుకు చాలా ఏళ్ల క్రితమే 19.6 ఎకరాల భూమిని గుర్తించారు. ఇంటి నిర్మాణానికి రూ.2.84 లక్షల చొప్పున మంజూరు చేస్తామంటూ అప్పట్లో ఇచ్చిన హామీ గాలికి వదిలేశారు. ఇక పడాలపేట, ఎటి అగ్రహారం గ్రామాల నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కుటుంబానికి రూ.6.75లక్షల చొప్పున చెల్లించేందుకు 2012 నాటి ప్రభుత్వం ప్రతిపాదించగా నిర్వాసితులు ఇందుకు సమ్మతించారు. ఈ లెక్కన రెండు గ్రామాల్లోని 648 కుటుంబాలకు మొత్తం రూ.43.74 కోట్ల మేర విడుదల చేయాలి. అది కూడా అమలుకు నోచుకోలేదు. సారిపల్లిలోని ప్రజలంతా ఇళ్ల తప్ప సర్వం కోల్పోతున్నందుకు ప్రత్యేక ఆర్థిక సాయం చేస్తామంటూ గతంలో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ లెక్కన మొత్తం 1450 కుటుంబాలకు రూ.75.69 కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా రూపొందించి ఏళ్లు గడుస్తున్నాయి. ఈ నాలుగు గ్రామాల వారికి వివిధ రూపాల్లో ప్రభుత్వం సుమారు రూ.193.21 కోట్ల మేర విడుదల చేయాల్సి ఉండగా, ఇందుకు జగన్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కించింది ఫిబ్రవరి లో నిర్వహించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. ఏళ్ల తరబడి ఎదురు చూసిన సారిపల్లి నిర్వాసితులు మార్చి 6వ తేదీన ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌లను నిలదీశారు. ఎప్పుడూ హామీలు తప్ప అమలు చేయడం కనిపించడం లేదంటూ మండిపడ్డారు. మరోవైపు టిడిపి కూడా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. వాస్తవానికి టిడిపి హయాంలో ఈ సమస్యకు పరిష్కారం చూపి ఉంటే నిర్వాసితులకు న్యాయం జరిగేది. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు... అన్నట్టుగా బాబు తాను చేసిన తప్పులను నిర్లక్ష్యాన్ని పక్కనబెట్టి వైసిపిపై విమర్శలు చేయడం వల్ల ఉపయోగం మేముంటుందని జనం చర్చించుకుంటున్నారు. ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలనే చర్చ కూడా నడుస్తోంది.

26న ఎన్నికల పరిశీలకులు తలాత్ పర్యటన

అక్రమాలపై నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం

ప్రజాశక్తి- విజయనగరం

అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 26 నుంచి ఎన్నికల సాధారణ పరిశీలకులు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా పర్యటించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన ఇక నుంచి వారంలో ఒకటి రెండు రోజులు అందుబాటులో ఉంటారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థుల అక్రమాలపై పరిశీలకున్ని సాధారణ ప్రజలు సైతం నేరుగా కలిసి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. పరిశీలకుని సెల్ నంబరు 9032338136కి ఫోన్ చేసి గానీ, electionobservervzm@gmail.com మెయిల్ ద్వారా గానీ అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, నగదు, మద్యం, ఇతర విలువైన ఆభరణాలు, వస్తువుల పంపిణీ తదితర ప్రలోభాలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుతో పాటు ఆ అంశానికి సంబంధించిన ఫొటో, వీడియో, వాయిస్ మెసేజ్ లేదా టెక్స్ట్ మెసేజ్‌ను జత చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు దారుని పేరు, అడ్రస్, సెల్ నెంబరును తెలియజేయాలి. వారిచ్చిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను తెలియజేయడం జరుగుతుంది.

కొండపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నగర పంచాయతీలో బడ్డుకొండ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండ పేట, జర జాపుపేట (లక్ష్మీ దేవి పేట)లో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందించిన పథకాలు గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించి గెలిపించాలని ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి వైసిపిని అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబ శివ రావు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపిలోకి వేమలి సర్పంచ్

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని వేమలి గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ సుంకరి సావిత్రితో పాటు ఆ గ్రామానికి చెందిన 200 వైసిపి కుటుంబాలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బేబినాయన సతీమణి శిల్ప నామినేషన్

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన సతీమణి శిల్పారావు టిడిపి డమ్మీ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. టిడిపి కౌన్సిలర్లు వి.హైమావతి, బి.శ్రీదేవితో కలిసి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని మూడు సెట్లు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీకు అందజేశారు. ఇప్పటి వరకూ 22 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

జనసేనలో చేరిన కాకర్లపూడి

ప్రజాశక్తి - భోగాపురం

ఇటీవల వైసిపికు రాజీనామా చేసిన కాకర్లపూడి శ్రీనివాసరాజు జనసేన పార్టీలో బుధవారం చేరారు. సింగవరం వద్ద జరిగిన ప్రజాగళం రోడ్ షో వద్ద జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు లోకం మాధవి శ్రీనివాసరాజును పరిచయం చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లోకం మాధవి గెలుపునకు మీరంతా సహకరించాలని ఆయనను కోరారు. ఆ పార్టీ నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి, చెల్లుబోయిన నర్సింగరావు, పతివాడ శ్రీనివాస రావు, పల్లంట్ల జగదీష్, పళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కుక్కలు దాడి

పరిస్థితి విషమం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పెదమేరంగి కూడలి పెట్రోల్ బంక్ ఎదురుగా గల ట్రాక్టర్ మెకానిక్ గంట రవీంద్ర భార్య గంట లక్ష్మిపై కుక్కలు దాడి చేశాయి. ఎప్పటి లాగే బుధవారం ఉదయం తన షాపు తెరుస్తున్న సమయంలో లక్ష్మి ముందుగా షాపు కు రాగానే ఒక్కసారిగా 17 కుక్కల గుంపు ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో ఆమె గట్టిగా కేకలు వేస్తూ సొమ్మసిల్లి పోయింది. వెంటనే షాపు లో ఉన్న రవీంద్ర వాటిని తరిమి కొట్టాడు. లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

రాష్ట్రానికి కేంద్రం ద్రోహం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా పోరాటాలని ఉధృతం చేసే కళారూపాలు ఎన్నికల్లో ప్రజలను చైతన్యపరిచి ప్రజా సమస్యలు అజెండాగా రాజకీయ పోరాటాన్ని ఉధృతం చేయాలని, ఎన్నికల్లో మన అభ్యర్థులు గెలుపుకు కృషి చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రజా కలలే ప్రజల్ని చైతన్యపరిచి సమాజ గమనాన్ని మార్చాయని, ఈ ఎన్నికల్లో బిజెపిని మార్చాలని, దాన్ని బలపరిచే వారిని ఓడించాలని కోరారు. ప్రజానాట్యమండలి జిల్లా బాధ్యులు కోరాడ ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రమణ, దళ నాయకులు డేవిడ్ వెంకటరమణ, నాగేశ్వరరావు, అంగద తదితరులు పాల్గొన్నారు

వైసిపి అవినీతి కోటను బద్దలు కొడదాం

(మొదటిపేజీ తరువాయి)

ఎద్దేవా చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై అకృత్యాలు పెరిగిపోయాయన్నారు.

విజయనగరంలో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి రియల్‌ఎస్టేట్ సెటిల్‌మెట్లు, అపార్ట్‌మెంట్‌ల అనుతులకు ఒక రేటు పెట్టి బాగా వసూలు చేసుకుంటున్నారని విమర్శించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కొండలను మింగేస్తున్నారని అన్నారు. ఆయన కబ్జాల అనకొండని విమర్శించారు. ఓటు అనే వజ్రాయుధాన్ని ఉపయోగించి జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని అన్నారు. ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును, నెల్లిమర్ల, విజయనగరం అభ్యర్థులు లోకం మాధవి, పి.అదితి విజయలక్ష్మిని గెలిపించాలని కోరారు.

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పదివేల మంది కెపాసిటి ఉన్న నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు బక్క చిక్కిపోయిందని, పని చేయడానికి కార్మికులకు పనిలేక ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చంపావతి నదిలో ఇసుకను ఇక్కడ నాయకులు దోచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తంగుడుబిల్లిలోని పదెకరాల కొండను తవ్వేశాడని ఆరోపించారు. ఇసుక, మట్టి దోచేస్తున్నాడని అటువంటి వ్యక్తికి ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు.అసమర్థ, అవినీతి, చేతకాని పాలనలో ఇలాగే ఉంటుందని సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచాలంటే కూటమి విజయం సాధించాలని అన్నారు. వైజాగ్ ఎయిర్ పోర్ట్సు ఈగలు తోలుకుంటుంటే ఇప్పుడు భోగాపురం ఎయిర్ పోర్టు ఎందుకని జగన్ ఎద్దేవా చేశారని, ఇప్పుడు భూములు కోసం ఎయిర్ పోర్టును నిర్మిస్తున్నట్లు మళ్లీ శంకుస్థాపన చేశారని విమర్శించారు. టిడిపి వారంతా కష్టపడి పనిచేసి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయించేలా పని చేయాలన్నారు. చింతపల్లి తీర ప్రాంతం నుంచి 40 కిలోమీటర్లకు ఒక జెట్టీ నిర్మించే దిశగా పనిచేస్తామన్నారు. సమయం ఆసన్నమైనది సౌండ్ ఎక్కువగా వస్తున్న ఫ్యాన్ స్విచ్ ఆపేయాలని పిలుపునిచ్చారు. తన కంఠంలో ప్రాణమున్నంత వరకూ యువత భవిష్యత్తు కోసం పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ త్యాగం చేసిన మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడుకు, బంగార్రాజుకు అభినందనలు తెలిపారు.

సభల్లో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల, విజయనగరం అసెంబ్లీ అభ్యర్థులు లోకం మాధవి, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జనసేన, టిడిపి నాయకులు కర్రోతు బంగార్రాజు, పడాల అరుణ, పాలవలస యశస్విని పాల్గొన్నారు.

బంగార్రాజు భవిష్యత్తును మేం చూసుకుంటాం

త్యాగాలను చేసిన నాయకులను గుర్తించుకుంటామని, సీట్లు రాకపోయినా సమర్థవంతమైన నాయకత్వం చేస్తున్న వారిని ప్రభుత్వంలో భాగస్వామ్యం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కర్రోతు బంగార్రాజు భవిష్యత్తును తాము చూసుకుంటామని హామీ ఇచ్చారు. నెల్లిమర్లలో ఒక బటన్ గాజు గ్లాస్‌పై, రెండో బటన్ సైకిల్ పైవేయాలని కోరారు. గాజు గ్లాసుపై బటన్ నొక్కితే జగన్ గుండెల్లో గుచ్చుకోవాలన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
గురువారం
25 ఏప్రిల్ 2024

ఆపరేషన్ ఆకర్ష్

ప్రతినిత్యం చస్తూ బతుకుతూ
మన సొత్తును దోచుకుతింటూ
కులాల మధ్య కార్చిచ్చు రేపి
మతాల మధ్య మారణహోమం సృష్టించి
పచ్చనోట్లు పంచుతూ
సారా చుక్కకు దాసోహం చేస్తూ
నిలదీసిన వారిని వెలివేస్తూ.. బలి చేస్తూ
ఉచితాలతో చస్తూ..బతుకుతూ..
అర్థాకలితో మనం అధికారం కట్టబెడితే
అధికార దర్పంతో హామీలన్నీ తుంగలో తొక్కేస్తూ
నీ బతుకును తలకిందులా చేస్తూ
నీవు ఛీకొట్టినా
మళ్లీ మళ్లీ నీ గడపకూ సలాం కొడుతూ
ఐదేళ్లకొకసారి నీరు గుర్తొస్తూ
నిన్ను బతికిస్తూ ఉంటుంది నీ ఓటు
తలరాతలు మార్చేది, ఏమార్చేది ఆ ఓటే
మత్తులోనే గమ్మత్తై తూలిపోకు
జర భద్రం..జర భద్రం
నీ బతుకు భవిత బహు భద్రం

- పెంటకోట లక్ష్మీ నరసింహం, విజయనగరం

ప్లీజ్ గంట సేపు సభకు రండి మూడొందలిస్తాం..

ప్రజాశక్తి-చీపురుపల్లి

'ప్లీజ్.. ఒక గంటసేపు సభకు రండి..మూడు వందలిస్తాం.. ఓటు ఎటువైపైనా వేసుకోండి..వచ్చి కనబడితే చాలు' అంటూ గ్రామాల్లోని నాయకులు ఓటర్లను బతిమలాడుకుంటున్నారు. మభ్యపెడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో ప్రజలను ఆకర్షించేందుకు చిన్నా చితక నాయకులు నానా తంటాలు పడుతున్నారు. తమ అభ్యర్థి మెప్పు కోసం ప్రజలకు డబ్బు ఆశ చూపి సభలో పాల్గొనాలని వేడుకుంటున్నారు. సభకు వచ్చిన ప్రతీ వ్యక్తికి రెండు లేదా మూడు వందల రూపాయలు ఇస్తామని, ఒక గంటసేపు కనబడి వెళ్లొచ్చని, ఆ తరువాత మీకు నచ్చిన వారికి ఓటు వేసుకోండనినాయకులు చెప్పడం గమనార్హం. ఓటర్లు కూడా ఏ పార్టీ నాయకులు పిలిచినా సభలకు, ప్రచారానికి వెళ్తున్నారు. దీంతో చివరకు రెండు వైపులా వెళ్తున్న ఓటర్లు ఏ నాయకుడికి పట్టం కడతారోనన్న చర్చ జరుగుతోంది.

మన్య ప్రాంతానికి దారేది?

రోడ్లు లేక కాలిబాటే శరణ్యం • అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామాలు

రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న వనకాబడి రహదారి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 77 పంచాయతీలు, 289 గ్రామాలు, 773 గిరిజన గూడేలు ఉన్నాయి. వీటిలో 323 గ్రామాలు కొండలపైనే ఉన్నాయి. సుమారుగా 1,87,829 మంది గిరిజనులు నివశించే గ్రామాల్లో 70 శాతం రోడ్లు లేక అవస్థలు పడుతున్నారు. కురుపాం మండలంలో సుమారు 23 పంచాయతీల్లో 55 గ్రామాలకు రోడ్లు లేవు. దీనివల్ల మొండెంఖల్లు, నీలకంఠాపురం పిహెచ్‌సిలతోపాటు కురుపాం సిహెచ్‌సికి రోగులు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గిరిజనులు 10 నుంచి 30 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా కొండల మీద గ్రామాల్లో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. దీంతో వైద్యం కోసం ఆస్పత్రులకు చేరేలోపే ప్రాణాలు విడిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం 27 పంచాయతీల్లో 60 గ్రామాలకుపైగా రోడ్లు లేవు. దీంతో తాడికొండ, రేగిడి, దుడ్డుకల్లు పిహెచ్‌సిలకు రావాలంటే డోలీలతో మోసుకు రావాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొమరాడ మండలం పూడేసు, ఎండభద్ర, పల్లపాడు, కూనేరు, మసిమండ, పెడుము, తుమ్మలవలస తదితర గిరిజన గ్రామాలకు చెందిన ప్రజానీకం ప్రయాణమంతా కాలినడకనే. ఇక లంజి గిరిజన గూడెం దాటి ఉన్న గూకల్లు, గుర్లిమ్మ, కుంతేసు, కో, జొప్పంగి, జాకూరు, జల, సంకేసు, వాటకకోసు తదితర గ్రామాలకు రహదారే లేదు. జియ్యమ్మవలస, సాలూరు, పాచిపెంట మండలాల్లోనూ అధ్వాన రోడ్లతో గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒడిశాకు అతి చేరువగా ఉన్న గ్రామం లంజి. కొమరాడ మండలం కూనేరు ప్రధాన రహదారి నుంచి 20 కిలోమీటర్లు కొండల్లో వెళ్తే తప్ప ఈ గ్రామానికి చేరుకోలేం. లంజి గ్రామంలో 300 మంది గిరిజనులు నివశిస్తుంటారు. బస్సు సౌకర్యం లేదు. తెల్లవారు జామున నాలుగు గంటలకు కాలినడకన బయల్దేరితే గానీ 11 గంటలకు మండల కేంద్రానికి చేరుకోలేని పరిస్థితి. అనారోగ్య పరిస్థితులు సంభవిస్తే ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సిందే. ఒక్క లంజి గ్రామమే కాదు. ఈ ప్రాంతంలో కుంతేసు, గొర్లెమ్మ, గూనకల్లు, బెడ్డతోపాటు 35కు పైగా గ్రామాలకు ఇదే దుస్థితి. అనేకమార్లు వినతులిచ్చినా పరిష్కారం మాత్రం శూన్యం. గుమ్మలక్ష్మీపురం మండలం వాడజంగి గ్రామానికి రహదారి లేకపోవడంతో గ్రామస్తులు శ్రమదానంతో కొంతమేర నిర్మించారు. ఇక్కడ 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా లేని పరిస్థితి. ఇక్కడ గిరిజనులకు వైద్యం గగనమే. కురుపాం మండలం ఒబ్బంగి పంచాయతీ జలబగుడలో 120 కుటుంబాలు ఉన్నాయి. గ్రామానికి రోడ్డు లేక వీరంతా నరకయాతన అనుభవిస్తున్నారు. ఐటిడిఎ, కలెక్టర్ గ్రీవెన్సులో గిరిజనులు అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. కానీ రోడ్డు మాత్రం బాగుపడలేదు. జలబగుడ గ్రామస్తులు మండల కేంద్రానికి రావడానికి 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. ఐదేళ్లకోసారి ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తున్న నాయకులు రహదారుల అభివద్ధికి శ్రద్ధ చూపడం లేదు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. దీంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండిపోతున్నాయి.

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అనువైన రహదారులు ఉండాలి. అప్పుడే అక్కడ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంతోపాటు అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సత్సంబంధాలు ఏర్పడతాయి. వారి జీవన ప్రమాణాల్లో వెలుగు రేఖలు వెల్లివిరుస్తాయి. 57 ఏళ్ల పాలనలో మన్యం పరిధిలోని నియోజకవర్గాల్లో టిడిపి, కాంగ్రెస్, వైసిపి హయాంలో రహదారుల నిర్మాణాలు కలగానే మిగిలాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. గిరిజనులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.

శ్రమదానంతో రోడ్డు బాగుచేస్తున్న గిరిజనులు

జోగిపురం రోడ్డు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్)

అభివృద్ధికి దూరంగా గిరిజన గ్రామం

నామినేషన్ల హోరు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో బుధవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ముహూర్తాలు బాగుండటంతో అత్యధిక మంది అభ్యర్థులు నామపత్రాలను రెండోసారి కూడా ఇచ్చారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి కోలాహలంగా నామినేషన్లు వేసేందుకు వెళ్లారు.

నామినేషన్ వేస్తున్న వైసిపి అరకు ఎమ్‌పి అభ్యర్థి తనూజారాణి

నామినేషన్ వేస్తున్న వైసిపి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర

నామినేషన్ వేస్తున్న టిడిపి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి


నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ పార్టీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పారావు

నామినేషన్ వేస్తున్న టిడిపి విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు

పాలకొండ అసెంబ్లీకి నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్, జనసేన అభ్యర్థులు చంటిబాబు, జయకృష్ణ

పార్వతీపురం అసెంబ్లీకి నామినేషన్ వేస్తున్న వైసిపి అభ్యర్థి జోగారావు, స్వతంత్ర అభ్యర్థి అక్కివరపు మోహనరావు

'కోట'పై కోళ్లది చెరగని ముద్ర

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గం పేరు చెప్పగానే, టక్కున గుర్తొచ్చేది కోళ్ల కుటుంబం. నాలుగు దశాబ్దాలపాటు శృంగవరపుకోటలో తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తూ వస్తోంది కోళ్ల ఫ్యామిలీ. 2009లో నియోజకవర్గ పునర్విభజనకు ముందు, ఉత్తరాపల్లి నియోజకవర్గంగా ఉండేది. 1983లో టిడిపి ఆవిర్భావంలో ఉత్తరాపల్లి నుంచి టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగారు కీర్తిశేషులు, మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు. వరుసగా ఐదుసార్లు (1983, 1985, 1989, 1994, 1999) గెలిచి సత్తాచాటారు. 1985, 89లో ఎన్‌టిఆర్ మంత్రి వర్గంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖా మంత్రిగా కొనసాగారు. 1999లో అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా పనిచేశారు. నియోజకవర్గంలో తిరుగులేని నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2009 పునర్విభజన తర్వాత ఉత్తరాపల్లి నియోజకవర్గం పోయి, శృంగవరపుకోటగా ఆవిర్భవించింది. దీంతో కోళ్ల అప్పలనాయుడు వారసురాలిగా రాజకీయ రంగప్రవేశం చేశారు మనవరాలు కోళ్ల లలిత కుమారి. వరసగా రెండుసార్లు ఎస్.కోట నుంచి గెలిచారు.

కోళ్ల అప్పలనాయుడు మొత్తం ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉత్తరావల్లి నుంచి ఐదుసార్లు టిడిపి నుంచి గెలుపొందిన ఆయన.. రేవిడి, ఎస్.కోట నుంచి చెరోసారి ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. 1985, 89లో ఎన్టీఆర్ మంత్రివర్గంలో కొంతకాలం దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

నియోజకవర్గాల పునర్విభజనతో గిరిజన నియోజకవర్గంగా ఉన్న శృంగవరపుకోట జనరల్‌గా మారింది. దీంతో కోళ్ల అప్పలనాయుడు మనవరాలు, కోడలు అయినటువంటి కోళ్ల లలితకుమారి శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి 2009లో తొలిసారి శాసనసభకు టిడిపి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014 సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి గెలుపొందారు. టిడిపి విజయనగరం జిల్లా అధ్యక్షురాలుగా, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులుగా కూడా పనిచేశారు. 2019 ఎన్నికల్లో టిడిపి నుంచి మరోసారి పోటీచేసిన ఆమె పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల్లో మళ్లీ టిడిపి అభ్యర్థిగా లలితకుమారి బరిలో దిగారు. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావుకు టికెట్ ఖరారు చేయడంతో ఇద్దరి మధ్య పోటీ జరగనుంది.

టిడిపితో సుదీర్ఘ అనుబంధం

కోళ్ల లలితకుమారి కుటుంబానికి టిడిపితో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఈ కుటుంబం 1962 నుంచి శాసనసభకు పలుమార్లు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది. 1962 రేవిడి నియోజకవర్గం నుంచి, 1967 శృంగవరకోట నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా కోళ్ల అప్పలనాయుడు శాసనసభలో అడుగెట్టారు. 1983 నుంచి 1999 వరకు టిడిపి తరపున వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో టిడిపి నుంచి అప్పలనాయుడు మనువరాలు లలితకుమారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగు దశాబ్దాలుగా కోళ్ల కుటుంబం టిడిపి తరపున ప్రాతినిధ్యం వహిస్తూ వస్తోంది.

కొండపల్లి శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి లక్ష్మీసింధు

పతి కోసం సతి ప్రచారం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన సతీమణి లక్ష్మీసింధు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి టిడిపికి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బెజవాడ రాజేశ్వరి, మజ్జి మహేష్, గాడి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పౌరుడి చేతిలో నిఘా నేత్రం

అసలే ఎన్నికల సమయం.. ఎలాగైనా నెగ్గాలనేది కొంతమంది అభ్యర్థుల ఆలోచన.. అందుకే ప్రలోభాలకూ వెనుకాడటం లేదు.. డబ్బులు, మద్యం, చీరలు.. ఇలా అనేక రూపాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం చూస్తుంటాం. ఇటువంటి అక్రమాలను అడ్డుకోవాలనే తపన పడుతుంటాం. కానీ ఏం చేయాలి? ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఎలా చేయాలి? ఇవేవీ తెలియదు. అందుకే ఎన్నికల సంఘం ఓటర్ల చేతికి మరో అస్త్రాన్ని అందించింది. అదే సి-విజిల్ యాప్. ఎన్నికల్లో అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకే ఈ నిఘా నేత్రాన్ని తీసుకొచ్చింది.

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు చేసే అక్రమాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించేందుకు ఓటరు చేతికి ఎన్నికల సంఘం ఇచ్చిన వజ్రాయుధం సి-విజిల్ యాప్. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ఈ యాప్ ద్వారా డబ్బు, మద్యం, చీరలు, ముక్కుపుల్లలు లాంటివి పంపిణీ, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, నాయకుల ఆగడాలను ఫొటో లేదా వీడియో తీసి పంపిస్తే చాలు!. 15 నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలను ఎన్నికల కమిషన్ గోప్యంగా ఉంచుతుంది.

సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ ఇలా

స్మార్ట్‌ఫోన్ కలిగిన ఓటర్లు ప్లేస్టోర్‌లో సి-విజిల్ (cVIGIL) అని టైప్ చేస్తే చాలు ఓపెన్ అవుతుంది. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దాన్ని ఓపెన్ చేసి, మొబైల్ నంబరు టైప్ చేయాల్సి ఉంటుంది. మొబైల్ నంబరుకు వచ్చే ఒటిపిని పొందుపరిస్తే మన చిరునామా వివరాలు అడుగుతుంది. వివరాలందిస్తే మన పేరు, మొబైల్ నంబరు యాప్‌లో నమోదవుతాయి. అవసరమైనప్పుడు యాప్ ఓపెన్ చేసి ఫొటో, వీడియోలను తీసి పంపిస్తే అది నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి చేరుతుంది. అక్కడి నుంచి తగిన చర్యల నిమిత్తం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, అక్కడి నుంచి తహశీల్దార్, ఎస్ఐలకు సమాచారం అందుతుంది. ఈ అధికారులు తమ సిబ్బందితో ఫిర్యాదుదారుడు చెప్పిన స్థలానికి వెళ్లి తగిన చర్యలు తక్షణం చేపడతారు. ఎన్నికల సందర్భంగా అక్రమాలను అడ్డుకోవడంతో పాటు వెలుగులోకి తెచ్చేందుకు స్మార్ట్‌ఫోన్ కలిగిన ఓటర్లు వినియోగించుకుంటే సత్ఫలితాలు పొందొచ్చు.

ఎలా పనిచేస్తుందంటే..

ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేసే స్మార్ట్‌ఫోన్లో సి-విజిల్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జరిగే ఏ చర్య అయినా యాప్ ద్వారా ఫొటో, వీడియో ఆప్షన్ ద్వారా రికార్డు చేయొచ్చు. ఫొటో తీసిన తర్వాత దాని గురించి వివరిస్తూ అప్‌లోడ్ చేస్తే, ఆ ఫిర్యాదును ఐదు నిమిషాల్లో క్షేత్రస్థాయి బృందం పరిశీలనకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పంపిస్తారు. యాప్‌లో పొందుపర్చిన జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా మీరున్న ప్రాంతానికి ఫ్లయింగ్ స్క్వాడ్ 15 నిమిషాల్లో చేరుకుంటుంది. మరో అరగంటలో ఫిర్యాదుకు సంబంధించిన చర్యలు చేపట్టి నివేదిక పంపుతారు. 50 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారి కేసు స్థితి(స్టేటస్)ని ఉన్నతాధికారులకు చేరవేస్తారు. యాప్ వినియోగిస్తున్న వ్యక్తి జిల్లా కంట్రోల్ రూమ్‌కు, ఎన్నికల్ రిటర్నింగ్ అధికారికి, పర్యవేక్షించే సిబ్బందికి, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు కనెక్ట్ అయి ఉంటారు. ఫిర్యాదుదారుడి వివరాలు కూడా గోప్యంగా ఉంటాయి. రెచ్చగొట్టే ప్రసంగాలు, ధనప్రవాహం, ఓటర్లకు తాయిలాల ఎరపై నిఘా వేయవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారుల బృందాలు పనిచేస్తున్నా ఈ యాప్‌తో క్షేత్రస్థాయిలో జరిగే ఉల్లంఘనలను క్షణాల్లో పసి గట్టవచ్చని అంచనా వేస్తోంది.

రెండు సార్లు స్వతంత్రుల విజయం

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత రెండు సార్లు.. టిడిపి, కాంగ్రెస్, వైసిపియేతర పార్టీల అభ్యర్థులు గెలుపొందారు. 1952లో కూనిశెట్టి వెంకటనారాయణదొర కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆయన కాంగ్రెస్ అభ్యర్థి అల్లు ఎరుకునాయుడుపై గెలుపొందారు. 1955లో ప్రజా సోషలిస్టు పార్టీ అభ్యర్థి అల్లు ఎరుకునాయుడు కాంగ్రెస్ అభ్యర్థి కూనిశెట్టి వెంకటనారాయణ దొరపై పోటీ చేసి విజయం సాధించారు. 1978లో ఎన్ఆర్‌టిసి రాజు సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆయన జనతా అభ్యర్థి ఎల్ఎన్ సన్యాసిరాజుపై పోటీ చేశారు. స్వతంత్ర్య అభ్యర్థులుగా 1962లో ఎల్ఎన్ సన్యాసిరాజు, 1967లో బోయిన రాజయ్య పోటీ చేసి ఎమ్మెల్యేలయ్యారు. ఇప్పటి వరకు టిడిపి ఐదు సార్లు, నాలుగు సార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైసిపి గెలుపొందాయి.

సెంచూరియన్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బుధవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, సిఎస్ఆర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విజయనగరం వైద్య కళాశాల డాక్టర్ శైలజ, కౌన్సిలర్ అప్పలనాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, జిటిఇటి సిఇఒ బాబుశంకర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీ డయోల్, ఎన్.సి.సి. అధికారి డాక్టర్ సతీష్, ఎన్.ఎస్.ఎస్. అధికారులు శ్రావణి, నారాయణతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యన్నపేటలో ప్రచారం చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్షేమం, అభివృద్ధి పాలనను మరోసారి ఆశీర్వదించండి అని వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అభ్యర్థించారు. బుధవారం నగరంలోని 44వ డివిజన్ అయ్యన్నపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం వైసిపి నాయకులు సైలాడ సత్యనారాయణ,లెంక మహేష్ మీడియాతో మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి ప్రదాతగా కోలగట్ల వీరభద్ర స్వామి ఐదేళ్లలో చేసిన కృషి మరువరానిదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నగరం అన్ని రంగాలలో కుంటుపడిందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలలో పాలు పంచుకున్న వ్యక్తి కోలగట్ల అని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, జోనల్ ఇన్చార్జి తమ్ము, పిన్నింటి సూర్యనారాయణ, కోలగట్ల పెద్ద కుమార్తె డాక్టర్ సంధ్య, అల్లుడు నాగాభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా యోచనలో కాంగ్రెస్ నాయకులు?

అధిష్టానం వైఖరికి నిరసనగా నిర్ణయం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సిగడాపు బంగారయ్య, ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు ఆ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో తమ సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై గత కొద్ది రోజులుగా వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ అభ్యర్థిగా మువ్వల పుష్పారావును పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. పుష్పారావు స్థానిక నాయకులు సిగడాపు బంగారయ్య, పుండరీకాక్ష నాయుడును ఖాతరు చేయకుండా పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం వివాదాస్పదమైంది. మిత్ర పక్షాలైన వామపక్ష నాయకులను కూడా కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి పిలవకపోవడం చర్చనీయాంశమైంది. అయితే పుష్పారావు కంటే మెరుగైన అభ్యర్థి గేదెల రామకృష్ణ కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నారు. రామకృష్ణకు సీటు ఇవ్వాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అధిష్టానానికి సిఫార్సు చేశారు. అయినా అధిష్టానం స్థానిక నాయకుల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కి ఎక్కడా స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం లేకపోయినా ఇక్కడ మున్సిపాలిటీలో ఒక వార్డులో కౌన్సిలర్ వున్నారు. గత కొంతకాలంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో 15వ వార్డు కౌన్సిలర్‌గా ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు భార్య విశాలాక్షి గెలుపు సాధిస్తున్నారు. సిగడాపు బంగారయ్య కూడా పట్టణ పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పారావు నామినేషన్ దాఖలు చేసే సమయంలో కూడా స్థానిక నాయకులకు పిలవకపోవడంతో వారు ఆశ్చర్యానికి లోనయ్యారు. దీంతో పార్టీకి రాజీనామా చేయాలని సీనియర్ నాయకులు భావిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి : అశోక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బుధవారం నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్తీక్‌కు అందజేశారు. అనంతరం మీడియాతో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అనే విషయాలను మరిచి పోయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దోపిడీని అరికట్టాలని, అందుకు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పది లక్షల మంది పిల్లలు స్కూల్‌కు దూరంగా ఉన్నారంటే విద్యా వ్యవస్థను ఎలా నాశనం చేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ప్రభుత్వం మాటలు ఒకలా పనులు వేరేలా ఉన్నాయన్నారు. ప్రజా ఆస్తులను,రాష్ట్ర సెక్రటేరియట్‌ను తాకట్టు పెడుతున్నవారు మనల్ని పాలిస్తున్నారన్నారు. మహిళల పైన హత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ఎన్‌డిఎతో విభేదించి మరలా ఎందుకు కలిశారని విలేకర్ల అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ పదవులు పట్టుకొని తాము వేలాడలేదన్నారు. జగన్‌లా తాము కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పలేదన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతి, జనసేన నాయకులు పాలవలస యశస్వి, బిజెపి నాయకులు రెడ్డి పావని మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనకు త్వరలో చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నామినేషన్‌కు ముందు అదితి విజయలక్ష్మి తల్లిదండ్రులు సునీలా గజపతి, అశోక్‌గజపతిరాజు ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి, నగరఅధ్యక్షులు లక్ష్మీవరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, రాజేష్ బాబు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అదితి విజయలక్ష్మి ఆస్తులు రూ.10 .25కోట్లు

తెలుగుదేశం పార్టీ విజయనగరం నియోజకవర్గం అభ్యర్థిగా నామినేషన్ వేసిన పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తనకు రూ.10.25 కోట్లు విలువైన చర, స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపర్చారు. షేర్లు రూపంలో రూ. 75,12,786 ఉన్నట్లు పేర్కొన్నారు. చరాస్తి రూ.4.95 కోట్లు, స్థిరాస్తి రూ.5.30కోట్లు, కుటుబ చరాస్తి రూ.55.65 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అప్పులు లేవని అఫిడవిట్ లో పేర్కొన్నారు. బంగారం 589.65 గ్రాములు, వెండి 5.25 కేజీలు ఉన్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - సీతంపేట

అంకిత భావంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు పేర్కొన్నారు. భామిని, సీతంపేట మండలాలకు చెందిన పిహెచ్‌సిల వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని ఐటిడిఎ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా ఉన్న ఆరోగ్యకార్యక్రమాలను పక్కా ప్రణాళికతో నిర్వహించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నమోదైనప్పటి నుంచి ప్రసవం జరిగే వరకూ క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో చేపట్టి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. కిల్కారీ సందేశాన్ని ప్రతి గర్భిణీ వినేలా పర్యవేక్షణ చేయాలన్నారు. రక్తహీనత నివారణపై దృష్టి సారించాలన్నారు. పిహెచ్సి ల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. ప్రిజం10 పక్కగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి రీత్యా వడదెబ్బ,డీ హైడ్రేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి, జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో డ్రైడే పక్కగా నిర్వహించి దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌డిపి, ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఆర్బిఎస్ కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎఫ్‌డిసి ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, ఎపిడిమియాలజిస్ట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్/టౌన్

పార్వతీపురం మండలం, పట్టణంలో బుధవారం మధ్యాహ్నం పెనుగాలులు సృష్టించిన బీభత్సానికి పలు గ్రామాల్లో చెట్లు విరగబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అంతవరకు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు ఆకాశంలో మబ్బులు పట్టి వాతావరణం చల్లబడినప్పటికీ అనంతరం వీచిన పెనుగాలులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెదమరికి పంచాయతీ కేంద్రంలో కరెంటు స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. చినమారికిలో చెట్లు విరిగిపోయి, ఇళ్లపై పడ్డాయి. ఆ సమయంలో గృహస్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంకంపేట కూడలిలో పెనుగాలులకు చెట్లు విరిగిపోయి ట్రాఫిక్కుకు అంతరాయం కలిగించింది.

పట్టణంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం కాస్తా చల్లబడింది. అయితే ఈదురుగాలులకు పట్టణంలో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రజారోగ్య అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందితో జెసిబి సాయంతో యుద్ధ ప్రాతిపదికన నేలకు ఒరిగిన చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

గాలులకు నేలకొరిగిన చెట్టు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

ఎంపి అభ్యర్థి బొబ్బిలి శ్రీను

ప్రజాశక్తి, విజయనగరం కోట

కాంగ్రెస్ గెలుపుతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభిస్తుందని నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలైన సిపిఐ, సిపిఎం, ఆమ్‌అద్మీ జిల్లా నాయకులతో కలిసి వెళ్లి బుధవారం కలెక్టర్లో శ్రీను నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో శ్రీను మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి ఇందిరమ్మ అని, ఆ రాజ్య స్థాపనకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి చేశారన్నారు. ఇప్పుడు ఆయన కలలను వైఎస్ షర్మిలా వల్లే సాధ్యమన్నారు. జల యజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతన్నలకు అండగా నిలిచిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను చదువుకునే అవకాశం కల్పించింది కాంగ్రెస్ అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా పేదలను ఆదుకున్న కాంగ్రెస్ అన్నారు. పేదల, మధ్య తరగతి ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశానికి ఇండియా కూటమి అధికారంలోకి రావడం అత్యవసరమని ప్రజలు గుర్తించి హస్తం గుర్తుపై ఓటు వేసి తనను పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని బొబ్బిలి శ్రీను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, సిపిఐ నాయకులు పి కామేశ్వరరావు, ఒమ్మి రమణ, బుగత అశోక్, సిపిఎం నాయకులు రెడ్డి శంకర్‌రావు, ఆమ్ అద్మీ నాయకులు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి జయకృష్ణ ఆస్తులు రూ.76.5లక్షలు

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో జనసేన తరపున పోటీ చేస్తున్న జయకృష్ణకు రూ.76,05,810 విలువైన ఆస్తులు ఉన్నట్లు తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బుధవారం ఆయన సమర్పించిన ఎన్నికల అధికారికి అందజేసిన అఫిడివిట్ ప్రకారం ఆస్తులు ఈ విధంగా ఉన్నాయి. జనసేన అభ్యర్థి జయకృష్ణ, ఆయన భార్య కోలక భగవతి తరపున బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు రూ.85,000 ఉన్నట్లు, అలాగే తన దగ్గర ఉన్న 10 తులాల బంగారం విలువ 6,50,000 గా, తన దగ్గర ఉన్న బైక్ లక్ష రూపాయలు, కారు విలువ రూ.10 లక్షలుగా మొత్తం 19,75,000 అని పేర్కొన్నారు. అలాగే తనకు వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములు, ఇంటి విలువను రూ.56,30,810గా తెలియచేసారు. అలాగే తనకు రూ.12,60,000 అప్పు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. అలానే తన మీద 2 కేసులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఆస్తులు రూ.54.75లక్షలు

ప్రజాశక్తి-పాలకొండ

సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న సవర చంటిబాబు బుధవారం తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. తను సమర్పించిన అఫిడివిట్ ప్రకారం తన ఆస్తుల వివరాలిలాన్నాయి. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు, అలాగే తన దగ్గర ఉన్న వాహనాల విలువ మొత్తంగా రూ.54,75,000 ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే తనకు రూ.37,90,540 అప్పు కూడా ఉన్నాయని, తన మీద ఎటువంటి కేసులు లేవని పేర్కొన్నారు.

నేటి నుంచి సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ ఇండియా వేదిక పార్టీలు బలపరిచిన కురుపాం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి మండంగి రమణ ఎన్నికల ప్రచారాన్ని గురువారం నుంచి ప్రారంభించనున్నారు. నేడు గరుగుబిల్లి మండలం ఉల్లి భద్ర వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభించి అక్కడ నుంచి సుంకి, నాగూరు , లకనాపురం, రావివలస, చిలకాం, దత్తి వలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

కేలమ్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - జామి

మండలంలోని భీమసింగి సెంటర్ వద్ద నవోదయ,సైనిక స్కూల్‌లో ప్రవేశానికి కేలమ్ కోచింగ్ సెంటర్ ప్రారంభమైంది. బుధవారం నుంచి సెంటర్లో శిక్షణా తరగతులు ప్రారంభమైనట్టు అయినట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ దేవులపల్లి సుదర్శన్ తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పడాల భూదేవి

ప్రజాశక్తి-పాలకొండ

టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పడాల భూదేవిని నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమె టిడిపి టికెట్ ఆశించినప్పటికీ పొత్తుల్లో భాగంగా జనసేన పార్టీకి కేటాయించగా ఆ పార్టీలో కూడా చేరి టికెట్ ఆశించారు. కానీ జనసేన టికెట్ జయకృష్ణకు కేటాయించటంతో తిరిగి ఈమె టిడిపిలోకి వచ్చేశారు. దీంతో ఈమెకు నియోజకవర్గ పార్టీ పగ్గాలు అందించారు. తనను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించడంతో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సామంతుల దామోదరరావు, వారాడ సుమంత్‌నాయుడు ఉన్నారు.

ప్రజాశక్తి
7
గురువారం 25 ఏప్రిల్ 2024

గుమ్మలక్ష్మీపురంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల: భద్రగిరిలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి

నాటి సిపిఎం పోరాట ఫలితమే నేటి మన్యం అభివృద్ధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నాటి సిపిఎం పోరాటల ఫలితంగా నేడు కురుపాం నియోజకవర్గంలో ముఖ్యంగా గుమ్మలక్ష్మీ పురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు అడుగులు పడ్డాయి. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పనులు కూడా సిపిఎం ఉద్యమాల ద్వారా సాధించుకున్నావే అనడంలో సందేహం లేదు. తద్వారా గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య, మెరుగైన వైద్యం వంటివి అందుబాటులోకి వచ్చాయి.

సిపిఎం సాధించిన విజయాలు...

2004 నుంచి గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు, ఉద్యమాలు జరిగాయి. వీటితో పాటు అప్పటి సిపిఎం ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. ఆ ఫలితంగా మన్య ప్రాంతంలో మొదటిసారిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. మన్య ప్రాంతంలో ఉన్న వందలాది మంది గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య చదవడానికి అవకాశం వచ్చింది. దూర ప్రాంతం వెళ్లి చదువుకోలేని నిరుపేదలకు ఎంతో మేలుగా ఉంటుంది.

ఏజెన్సీ ప్రాంతంలో ఏడాది పొడవునా ఏదో ఒక గ్రామంలో అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉండేవి. లక్షలాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లడంతో గిరిజనులు ఆర్థికంగా నష్టపోయేవారు. అగ్ని ప్రమాదాల నివారణకు గుమ్మలక్ష్మీపురంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ధర్నాలు, పోరాటాలు జరిగాయి. ఆ ఫలితంగా 2006లో గుమ్మలక్ష్మీపురంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఏజెన్సీ ప్రాంతానికి కేంద్ర బిందువుగా ఉన్న భద్రగిరి ప్రభుత్వ పది పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల పాటు పోరాటాలు జరిగాయి. కురుపాంలో 21రోజులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆ ఫలితంగానే గుమ్మలక్ష్మీపురం లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది. మరో వైపు ఈ ప్రాంతంలో నిత్యం రోడ్డు, అగ్ని ప్రమాదాలు, ఆత్మహత్యలు వంటి సంఘటనల్లో చనిపోయిన వారి దేహాలను పోస్టుమార్టం చేసేందుకు స్థానికంగా పోస్టుమార్టం నిర్వహణ లేకపోవడంతో పార్వతీపురం, విజయనగరం వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. దీంతో రెండు, మూడు రోజుల పాటు గిరిజనులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడేవారు. ఇటువంటి తరుణం సిపిఎం పోరాట ఫలితంగా భద్రగిరిలో పోస్టుమార్టం గది నిర్మించి తోటి ఏర్పాటు చేశారు. దీంతో ప్రజల కష్టాలు కొంతమేర తీరాయి.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు, డిఎంఒ జగన్మోహనరావు

మలేరియా నియంత్రణ అందరి బాధ్యత

నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మలేరియా నియంత్రణ మనందరి బాధ్యత అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాధరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు జిల్లా ఆరోగ్య కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సమానత్వ ప్రపంచం కోసం మలేరియాతో పోరాటాన్ని ఉధృతం చేయాలి అన్న అనే ప్రపంచ మలేరియా దినోత్సవం నినాదాన్ని సాధించడానికి ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువ మేర విస్తరించి ఉన్నందున మలేరియా నియంత్రణకు మరింత కృషి చేయాలని, సిబ్బంది శాఖల సమన్వయంతో పనిచేయాలని, మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఎక్కువ దృష్టి సారించి పక్కా ప్రణాళికతో కార్యాచరణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఫీవర్ సర్వెలెన్స్ ద్వారా ఇంటింటి సర్వే చేసి జ్వర లక్షణాలతో ఉన్న వారిని గుర్తించాలని, వెంటనే నిర్ధారణ పరీక్షలు జరిపి మలేరియా, డెంగీ జ్వరాలుగా గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి జ్వరం తగ్గే వరకూ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా డ్రైడే కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించి, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. దోమ తెరలు వినియోగించాలన్నారు. ఐఆర్ఎస్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ అవసరమైన చోట సిబ్బంది చేయించాలన్నారు. హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి జ్వర లక్షణాలున్న వారికి వెంటనే పరీక్షలు జరపాలన్నారు.

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని, మలేరియా జ్వర నిర్ధారణకు ఆర్.డి.టి.,రక్త పూతలు(స్లైడ్స్)సేకరణ పరీక్షలు క్షేత్ర స్థాయిలో, ఆసుపత్రుల్లో నిర్వహించడం జరుగుతుం దన్నారు. మలేరియా నియంత్రణకు ముందస్తు కార్యాచరణగా మే15 నుండి మొదటి విడత స్ప్రేయింగ్(దోమల నియంత్రణ పిచికారీ) కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, 401 గ్రామాలు స్ప్రేయింగ్‌కు ఎంపిక కాబడినవి అన్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు.

జనసేన అభ్యర్థిగా జయకృష్ణ నామినేషన్

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ కూటమి జనసేన అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ బుధవారం తన నామినేషన్ దాఖలు చేసి రిటర్నింగ్ అధికారి శుభమ్ బన్సల్‌కు అందజేశారు. తొలుత సీతంపేట సంత మార్కెట్ నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, నాయకులు గండి రామనాయుడు, గర్భాన సత్తిబాబు, కె.అప్పలనాయుడు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సవర చంటిబాబు ఆర్వో శుభమ్ బన్సల్కు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ గిరిజనులకు అండగా ఇండియా కూటమి కాంగ్రెస్ ఉంటుందన్నారు. కాంగ్రెస్ అమలు చేయనున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం తిరుపతిరావు, జి.సింహాచలం, సిపిఐ కార్యదర్శి కె.మన్మధరావు తదితరులు ఉన్నారు

పార్వతీపురంరూరల్ : అరకు పార్లమెంటు, పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థులుగా తనుజారాణి, అలజంగి జోగారావు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. పాత బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చిన అనంతరం తమ నామినేషన్లను దాఖలు చేశారు.

సాలూరు: టిడిపి అభ్యర్థి సంధ్యారాణి బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆర్ఒ విష్ణుచరణ్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. గురువారం ఆమె పట్టణంలోని భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

కాంగ్రెస్ అభ్యర్థిగా మువ్వల పుష్పారావు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలంతో కలిసి ఆయన నామినేషన్ పత్రాలను ఆర్వో విష్ణు చరణ్‌కు అందజేశారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు సిగడాపు బంగారయ్య, ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడు లేకుండా నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల శిక్షణకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించిన రెండో విడత శిక్షణ తరగతుల నిమిత్తం ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండాలని ఎంఇఒ సామల సింహాచలం తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన పిఒ, ఎపిఒలకు మొదటి విడత శిక్షణ పూర్తయ్యాయని, అదేవిధంగా రెండో విడత శిక్షణా కార్యక్రమం త్వరలోనే ఉంటుందన్నారు. అందువల్ల సెలవుల్లో ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాల హెచ్ఎంలు పాఠశాల తాళాలను ఆ గ్రామంలోని బిఎల్ఒకు అందజేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసి సమాచారం అందజేయాలన్నారు.

సిపిఎం అభ్యర్థి రమణ రెండో సెట్ నామినేషన్

ప్రజాశక్తి - కురుపాం

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ బుధవారం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం ఒక సెట్ నామినేషన్ వేయగా రెండో సెట్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణ కు అందజేశారు. అలాగే సిపిఎం పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బిడ్డక శంకర్రావు బుధవారం ఒక సెట్ నామినేషన్‌ను తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఒకు నామినేషన్ పత్రాలు అందజేశారు. టిడిపి అభ్యర్థిగా అడ్డాకుల నరేష్ ఒక సెట్ నామినేషన్ వేశారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి రెండో సెట్ నామినేషన్ వేశారు.

సాగునీరు లేక నిరుపయోగంగా ఉన్న భూములు

రబీకి అందని సాగునీరు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో రబీలో సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రబీ సాగు చేస్తున్న రైతులకు సాగునీటి ఇబ్బందులు అంతా, ఇంతా కావు. మండలంలోని వేరు శనగ, మొక్కజొన్న, మినుములు తదితర పంటలు వేసిన రైతులు పొలాలకు సాగు నీరందక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల తోటపల్లి ఆధునీకరణ పనులు పూర్తి కాకపోవడంతో సాగు నీరు విడుదల సక్రమంగా జరగటంలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వెలగవాడలో నరసింహ చెరువులో ఐదేళ్లగా మూడు బిందెలు నీరు కూడా ఉన్న పరిస్థితులు లేవు. ఆ చెరువు నుండే పిల్ల కాలువలకు నీరు వెళ్ళింది. కనీసం మూగ జీవాల దాహార్తిని తీర్చటానికి కూడా చెరువులో నీరు లేదు.

ఎపిటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల నూతన కమిటీ ఎన్నికైంది. ఈ ఎన్నికకు జిల్లా అధ్యక్షులు ఎం.శివున్నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి వెంకట నాయుడు హాజరయ్యారు. మండల అధ్యక్షులుగా బాల సత్యనారాయణ, కార్యదర్శిగా ఎస్.సత్యంతో పాటు కమిటీని ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు సుక్క శ్రీదేవితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బస్సులన్నీ సిఎం సభకు తరలించడం దారుణం

ప్రజాశక్తి - కొమరాడ

ముఖ్యమంత్రి సిద్ధం కార్యక్రమానికి పార్వతీపురం డిపో నుంచి అన్ని బస్సులను తరలించడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సిఎం కార్యక్రమానికి ఆర్‌టిసి బస్సులు వేసిన సమాచారాన్ని ఆర్‌టిసి డిపో అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వడంలేదన్నారు. దీంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఆర్టీసీ ఎంక్వైరీకి ఫోన్ చేస్తే గానీ బస్సులు వస్తాయా? రావో? తెలియని పరిస్థితి ఉందని అన్నారు. పార్వతీపురం నుంచి కూనేరుకు వెళ్లే రోడ్లో మంగళ, బుధవారాలు బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు సక్రమంగా నడపాలని లేకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు గౌర్నాయుడు, శివ నాయుడు తదితరులున్నారు.

14 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బూరుజోల పంచాయతీ పరిధి గల 14 మంది గ్రామ వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. వీరు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుకు అందజేశారు.

సీతంపేట ఐటిడిఎ పిఒగా బన్సల్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ కొత్త ప్రాజెక్టు అధికారిగా, పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఎస్‌హెచ్ శుభం బన్సల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన పిఒ కల్పనా కుమారి ఆకస్మిక బదిలీ కావడంతో జెసి సోబిక నుంచి బాధ్యతలు స్వీకరించారు. బన్సల్ శాప్ ఎండిగా పనిచేస్తూ ఎక్కడికి బదిలీపై వచ్చారు. 2019 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందినవారు ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం పాలకొండ నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల గడువు ముగిసిన అనంతరం నామినేషన్ల పరిశీలనకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, తహశీల్దార్లు మహేశ్వరరావు, ఎంపిడిఒ కె.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జనంలోకి మనం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పోస్టల్ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలు, ఖాతాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. జనంలోకి మనం కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయనగరంలో పోస్టల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెడ్ పోస్టాఫీసు ఆవరణలో ప్రత్యేక మేళా నిర్వహించారు. 10 సంవత్సరాల లోపు బాలికలకు సుకన్య సమృద్ధి ఖాతా, మహిళల కోసం మహిళా సమ్మాన్ ఖాతాలు అందరికీ అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతా ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాలకు రాయితీలను పొందవచ్చునని తెలిపారు. ఆధార్, తపాల జీవిత బీమా సౌర్యాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.నూకరాజు, అసిస్టెంట్ సూపరింటిండెంట్ ఆఫ్ పోస్ట్ పి.సుందరనాయుడు, హెడ్ పోస్ట్‌మాస్టర్ యు.గణపతిరావు, ఐపిపిబి మేనేజర్ సిహెచ్ సతీష్, పిఆర్ఐ ఇ.శంకరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ రోజు ఇతర రాష్ట్ర కార్మికులకూ సెలవు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మన రాష్ట్రంలో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులకు, ఆయా రాష్ట్రాలలో జరిగే ఎన్నికల రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు ఉపకార్మిక కమిషనర్ ఎన్.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో ఏప్రెల్ 19, కర్నాటకలో ఏప్రెల్ 26, మే 7, తెలంగాణలో మే 13, ఛత్తీస్‌ఘడ్‌లో ఏప్రెల్ 19, ఏప్రెల్ 26, మే 7, ఒడిషాలో మే 13, మే 20, మే 25, జూన్ 1, పాండిచ్చేరిలో ఏప్రెల్ 19న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మన పొరుగు రాష్ట్రాలకు చెందిన కార్మికులు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్నారని, వారంతా తమ స్వస్థలాలకు వెళ్లి ఓటుహక్కును వినియోగించుకొనేందుకు ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగే తేదీల్లో వారికి వేతనంతో కూడిన సెలవును మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

మార్చి నెల జీతం వెంటనే చెల్లించాలి

కమిషనర్‌కు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ క్లీన్ ఎన్విరాన్మెంటల్ వర్కర్లకు, డ్రైవర్లకు మార్చి నెల జీతాలు తక్షణమే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జగన్మోహన్, బాబురావులు మాట్లాడుతూ మార్చి నెల వేతనం నేటికీ ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. సమ్మె కాలపు జీతం సగం పడిందని మరో సగం రావలసి ఉందని గుర్తు చేశారు. సంక్రాంతి కానుక రూ.1000 కూడా నేటికీ మంజూరు కాలేదని, వెంటనే ఇప్పించాలని కమిషనర్‌ని కోరామని తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ 4 రోజుల్లో జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సంక్రాంతి కానుక, సమ్మె కాలపు జీతం బకాయిల కోసం అప్లయ్ చేశామని, వచ్చిన వెంటనే చెల్లిస్తామని చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శ్రీను, రాము, లక్ష్మి, సరస్వతి, శంకర్, విక్రం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తా..

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కళావెంకటరావు ● అట్టహాసంగా నామినేషన్

ప్రజాశక్తి-చీపురుపల్లి

తనను చీపురుపల్లి నుంచి గెలిపిస్తే నియోజకవర్గంలో మూత పడి ఉన్న పరిశ్రమలను తెరిపిస్తానని టిడిపి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా కళావెంకటరావు బుధవారం నామినేషన్ వేశారు. వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తల కేరింతల మధ్య ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను స్థానిక రిటర్నింగ్ అధికారిని బి.శాంతికి ఆర్‌డిఒ కార్యాలయంలో అందజేశారు. విజయనగరం పార్లమెంటు టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్‌నాయుడు, గద్దే బాబూరావు, కె.త్రిమూర్తులరాజు, నాలుగు మండలాల టిడిపి నాయకలు పాల్గొన్నారు. అనంతరం మూడురోడ్లు కూడలిలో జరిగిన బహిరంగ సభలో విజయనగరం పార్లమెంటు టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, కిమిడి నాగార్జున, గద్దే బాబూరావు, కె త్రిమూర్తులరాజుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో పండిన ధాన్యం పంట ఇక్కడున్న రాజకీయ నాయకుల మిల్లులకే ఇవ్వాలట, తాను గెలిస్తే అలాంటిది ఏమీ లేకుండా ఎవరు పండించిన పంట వారి కోరిక మేరకే మిల్లులకు ఇచ్చుకునే విధంగా చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తానని హామీ ఇచ్చారు. వ్యాపారాలు చేసుకునే వారు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా వ్యాపారాలు చేసుకోవచ్చని అన్నారు. రాబోయే ఐదేళ్లలో చీపురుపల్లిని మీరందరి సహకారంతో సస్యశ్యామలం చేస్తామని అన్నారు. ఎన్నికలలో పార్లమెంటుకు కలిశెట్టి అప్పలనాయుడుకు, మరొక ఓటు ఎంఎల్‌ఏగా పోటీ చేస్తున్న తనకు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, తాడ్డి సన్యాసి నాయుడు, సారిపాక సురేష్, తిరుమలరాజు కిరణ్‌రాజు, రెడ్డి గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బహిరంగ సభకు హాజరైన జన సందోహం

ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి- మెంటాడ

ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ కోరారు. బుధవారం మండలంలో జయితి, కొండలింగాలవలస, ఇప్పలవలస గ్రామాల్లో సిపిఎం ఎంపి అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం చొరవతో యుపిఎ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని, దానివల్ల నేడు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పనులు దొరకుతున్నాయని చెప్పారు. అటువంటి ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి మోసం చేసిందన్నారు. అటవీ హక్కుల చట్టాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. హక్కులను కాలరాస్తోందన్నారు. బిజెపి దోపిడీకి, వైసిపి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రాంబాబు, రాకోటి రాములు, తామరాపల్లి సములు, సువ్వాడ తిరుపతి, ఎం.అప్పలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు మర్రాపు సూర్యనారాయణ

నేను ఎవరికీ అన్యాయం చేయలేదు

వైసిపి ర్యాలీలో రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

నా రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే గా ఏనాడూ ఏ ఒక్కరికీ అన్యాయం చేయలేదని, తన వద్దకు వచ్చిన వారికి చేతనైనంత సాయం చేశానని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం ఆయన వైసిపి నాయకులు జర్జాపు ఈశ్వరరావు, గిరి రఘుతో కలిసి ఆయన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. తన సోదరుడు, మావుడి సర్పంచ్ పీడిక సుదర్శనరావుతో మరో నామినేషన్ దాఖలు చేయించారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని శ్యామలాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది నాయకులు కార్యకర్తలు, అభిమానులతో మెయిన్ రోడ్, వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్,కోట వీధి, పెదకోమటి పేట, డబ్బివీధి వీధులు మీదుగా తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ జంక్షన్‌లో ఆయన ర్యాలీ నుద్దేశించి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానంలో ఎమ్మెల్యేగా ఏ వర్గానికి అన్యాయం చేయలేదని చెప్పారు. ప్రధానంగా పట్టణంలోని వ్యాపారుల ప్రయోజనాల కోసం ప్రధాన రహదారి విస్తరణ లేకుండా ప్రయత్నించానని చెప్పారు. రోడ్డు విస్తరణకు బదులుగా బైపాస్ రోడ్డు నిర్మించామని చెప్పారు. పెదమార్కెట్‌లో దుకాణాలను పడగొట్టి కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో చర్యలు తీసుకుంటే తాను వ్యాపారులకు అండగా నిలిచానని అన్నారు. తన వద్దకు వచ్చిన ఉద్యోగుల పట్ల కూడా ఏనాడూ అమర్యాదగా వ్యవహరించలేదన్నారు. తనకు చేతనైనంత సాయమే చేశానని చెప్పారు.రానున్న ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి తనకు గెలిపిస్తే మరిన్ని అభివద్ధి పనులు చేస్తానని రాజన్నదొర చెప్పారు. చేరుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, ఎఎంసి మాజీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

SAI RANGA POLYTECHNIC
(Sponsored by Sri Venkata Ganapathi Educational Society)
Pothanapalli (village), Srungavarapukota (Mandal) Vizianagaram (Dist) - 535145

FACULTY REQUIRED

Applications are invited from the eligible candidates for the following posts.

Name of the POST	Department	Qualifications
LECTURERS/ SR LECTURERS	Computers Engineering, Mech, EEE, ECE,	B.E/B.Tech/M.E/ M.Tech in relevant branches with first class
	English,Maths,Physcis, Chemistry, Library	M.Sc/M.A with first class
LAB TECHINICAINS	Civil, Mech, EEE, ECE, Computers	Diploma in relevant branches ITI in relevant trades
Administrative officer/ Accountant/Office Assistant	OFFICE	Any Degree with knowledge in MS-Office & Tally

Qualifications and experience as per norms of AICTE, New Delhi and SBTET, Vijayawada. Preferences for experienced candidates and fresher's can also apply. Apply immediately through email: svges2015@gmail.com Contact: 9989601640, 9160742263